

చీకట్లు పోవాలె.. వెలుగులు నిండాలె

నేడు దీపావళి
- ఇంటింటా సందడి
- రంగురంగుల పటాకులు.. ప్రమిదలు
- కిక్కిరిసిన మార్కెట్
- జాగ్రత్తలు తప్పనిసరంటున్న నిపుణులు

ప్రకృతి.. మనుషులది విడదీయరాని అనుబంధం.. మనం ఏం చేసినా పర్యావరణ హితంగా ఉండాలి. వెలుగుల పండగ దీపావళిని ప్రకృతి హితంగా జరుపుకుందాం. విషపూరిత రసాయనాలతో తయారైన బాణసంచా కాల్చితే ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. భారీ శబ్దం కలిగించే వాటితోనూ ప్రమాదం పొంచి ఉంది. ఇంటిల్లిపాదీ పర్యావరణ హిత టపాసులను కాల్చి మరింత అందంగా దీపావళిని జరుపుకుందాం. నేటి వెలుగుల వేడుకకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు.
– కోల్‌సిటీ/కరీంనగర్ కల్చరల్/కరీంనగర్ క్రైం/విద్యానగర్/సిరిసిల్లకల్చరల్

నేటి దీపావళి సందర్భంగా మార్కెట్లో సందడి నెలకొంది. కరీంనగర్ సిటీతో పాటు గోదావరిఖని, పెద్దపల్లి, సిరిసిల్ల, వేములవాడ, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి తదితర పట్టణాలతో పాటు గ్రామాల్లో బంతిపూలు, ప్రమిదలు, ఇతర పూజా సామగ్రిని పెద్ద ఎత్తున విక్రయించారు. పెద్దసంఖ్యలో టపాసుల దుకాణాలు ఏర్పాటు చేయగా ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి.

పర్యావరణహితం ప్రధానం

దీపావళి రోజు పేల్చే బాణాసంచాతో పర్యావరణానికి పెద్ద ముప్పు వాటిల్లుతుందని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క టపాసు పేలితే వచ్చే పొగ అయిదువందల సిగరెట్లకు సమానం అన్నది పుణె పరిశోధకుల మాట. దీపావళి



వేడుకలపై గతంలో సుప్రీంకోర్టు ఆంక్షలు విధించింది. రాత్రి ఎనిమిది గంటల నుంచి పది గంటల వరకు తక్కువ కాలుష్యం వచ్చే గ్రీన్‌క్రాకర్స్ వాడాలని సూచించింది. మార్కెట్లో గ్రీన్ క్రాకర్స్ విక్రయిస్తున్నప్పటికీ, చాలా మంది కాలుష్యం వెదజల్లే బాణాసంచాలనే కాల్చుతున్నారు.

బాణాసంచాతో అనారోగ్య సమస్యలు

బాణాసంచాతో వ్యాపించే రసాయనం వల్ల శ్వాస వ్యవస్థ దెబ్బతింటుంది. మెగ్నీషియం, జింకు, నైట్రేట్, గంధం వంటి పదార్థాలతో తయారైన బాణసంచా పొగపీల్చితే ఆస్తమా, ఇతరత్రా శ్వాసకోశ, ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులకు ఆస్కారం ఉంటుంది. శబ్ద తీవ్రత ఎక్కువగా ఉండటం వల్ల కర్ణభేరి దెబ్బతింటుంది. పొగ కళ్లల్లోకి వెళ్తే కంటి పొరలు దెబ్బతిని చూపు కోల్పోయే ప్రమాదం ఉంది. తక్కువ శబ్దం వచ్చే బాణసంచా కాల్చడం అన్ని విధాలా శ్రేయస్కరం.



పెద్దపల్లిలో పూజాసామగ్రి విక్రయాలు



గోదావరిఖనిటౌన్ : నగరంలో పూలు, పూజాసామగ్రి కొనుగోళ్లు

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- పెట్రోల్ బంకులు, గుడిసెలు, గడ్డివాములకు దూరంగా పటాకులు కాల్చాలి. రాకెట్లు వంటి వాటిని విద్యుత్ తీగలు, చెట్ల కింద కాల్చొద్దు. ఇంట్లో బాణసంచాను గ్యాస్‌స్టవ్, ఇతరత్రా పొయ్యిల పక్కన ఉంచొద్దు.
- చిన్న పిల్లలు, వృద్ధులు గర్భిణులు నివసించే చోట భారీ శబ్దం చేసే పటాకులు కాల్చొద్దు. కాకరవత్తులు, విష్ణుచక్రాలు కాల్చిన తర్వాత వాటి ఇనుప తీగలు ఎక్కడ పడితే అక్కడ పడేయొద్దు.
- టపాసులు కాల్చే ప్రాంతంలో ప్రాథమిక చికిత్సకు సంబంధించిన కిట్‌ను దగ్గర ఉంచుకోవాలి. కాటన్ దుస్తులు, కళ్లద్దాలు ధరించం మంచింది. కంట్లో ఏదైనా పడినట్లుగా అనిపిస్తే పారేనీటిలో 10నిమిషాల పాటు కంటిని శుభ్రం చేయాలి. ఆలస్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించాలి.
- అనుకోని సంఘటన ఏదైనా జరిగితే డయల్ 100కి డయల్ చేసి పోలీసుల సాయం తీసుకోవాలి. అవసరమైతే 108కి ఫోన్ చేయాలి. ఎక్కడైనా అగ్ని ప్రమాదాలు జరిగితే అగ్నిమాపక వాహనాలు సిద్ధంగా ఉన్నాయి.

ఫైర్‌స్టేషన్ల ఫోన్ నంబర్లు

కరీంనగర్	8712699240
హుజూరాబాద్	8712699242
జమ్మికుంట	8712699244
చొప్పదండి	8712699246
మానకొండూర్	8712699248
పెద్దపల్లి	8712699202
మంథని	8712699204
గోదావరిఖని	8712699206
జగిత్యాల	8712699234
మెట్‌పల్లి	8712699236
ధర్మపురి	8712699238
సిరిసిల్ల	8712699258
వేములవాడ	8712699260

శుక్రవారం నోములు



అమావాస్య రాత్రి గురువారమే ఉండడంతో దీపావళి, లక్ష్మీపూజలు ఈ రోజే జరుపుకోవాలి. 1వ తేదీ శుక్రవారం అమావాస్యతో కూడిన స్వాతీ నక్షత్రం ఉన్నందున కేధారేశ్వర వ్రతాలు, పడిపోయిన నోములు, పాత నోములు, కొత్త నోములు నోముకోవచ్చు.
– నమిలకొండ రమణాచార్యులు, కరీంనగర్

కంటి రక్షణ ప్రధానం



బాణాసంచా కాల్చేప్పుడు కంటిలో ఏవైనా మెరుపులు పడితే నలపడం చేయకూడదు. సౌండ్ పొల్యూషన్ లేకుండా వెలుతురు ఇచ్చే క్రాకర్లు ఉపయోగించాలి. కళ్ల రక్షణకు గాగుల్స్ వాడాలి. పరిస్థితి తీవ్రతను బట్టి నిపుణుడైన కంటివైద్యున్ని సంప్రదించాలి.– కత్తి మురళీకృష్ణ, కంటి వైద్య నిపుణుడు

నిబంధనలు తప్పనిసరి

బాణాసంచా దుకాణాల ఏర్పాటుకు సంబంధితశాఖల అనుమతి తప్పనిసరి. దుకాణాలు జనావాసాల్లో ఏర్పాటు చేయొద్దు. టపాసులు విక్రయించే ప్రాంతంలో బకెట్లలో ఇసుక, డ్రమ్ముల నిండుగా నీళ్లు అందుబాటులో ఉంచుకోవాలి. చట్టబద్ధంగా ఆమోదించిన, నాణ్యమైన బాణసంచా విక్రయించాలి. పండుగ ముగిశాక మిగిలిన బాణాసంచాను అగ్నిమాపకశాఖ అధికారులు ఎంపిక చేసిన గోదాముల్లో వ్యాపారులు భద్రపరచాలి. నిబంధనలకు విరుద్ధంగా నచ్చినచోట నిల్వ చేయటంతో ప్రమాదాలు జరిగే అవకాశముంది.

చర్మ రక్షణ కోసం



పండుగ పూట వీలైనంత వరకు సిల్క్, నైలాన్ దుస్తులు వేసుకోకూడదు. అనుకోకుండా ప్రమాదం జరిగి చర్మం కాలితే ధారగా పడుతున్న నల్లా నీటికింద గాయపడిన ప్రాంతాన్ని శుభ్రం చేసుకోవాలి. కాటన్‌తో కవర్ చేసి మంచి చర్మ వ్యాధి నిపుణుడిని సంప్రదించాలి.
– వై.వెంకటేశ్, చర్మ వ్యాధుల నిపుణుడు

అప్రమత్తంగా ఉండాలి



దీపావళి సందర్భంగా ప్రజలు బాణాసంచా కాల్చే విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. సిలిండర్లు, అగ్గిపెట్టెలు, ఇతర పదార్థాలకు దూరంగా కాల్చాలి. ఏదైనా ప్రమాదం సంభవిస్తే వెంటనే ఫైరింజిన్లకు ఫోన్ చేయాలి. సిబ్బందితో సిద్ధంగా ఉంటాము. – శ్రీనివాస్‌రెడ్డి, డివిజన్ ఫైర్ ఆఫీసర్

న్యూస్‌రీల్

ఆధారాలు ఉంటే పరిహారం



మాట్లాడుతున్న జడ్జి స్వప్నరాణి

పెద్దపల్లిరూరల్: పల్లెల్లో పంటలు సాగు చేసే రైతులు తమకు అవసరమైన విత్తనాలను కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని జడ్జి స్వప్నరాణి సూచించారు. అప్పన్నపేట గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె పలు సూచనలు చేశారు. కొనుగోలు చేసిన విత్తనాలు కల్తీ, నకిలీవై ఆశించిన దిగుబడి రాకపోతే కోర్టును ఆశ్రయించి పరిహారం పొందేందుకు అవకాశం ఉందని తెలిపారు. ఇందుకోసం తగిన ఆధారాలు ఉండాలని సూచించారు. జాతీయ న్యాయసేవ సంస్థ ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబరు 15100కు కాల్ చేసి న్యాయ సాయం పొందవచ్చని వివరించారు. సైబర్ నేరాల బాధితులు 1930కు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రతినిధులు శ్రీనివాస్, సంకీర్తన, శంకర్, శరత్, హనుమాన్‌సింగ్, నరేశ్, ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మొద్దు



కొనుగోళ్లు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయ్

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని, దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. దేవునిపల్లి, కొదురుపాక, చిన్నకల్వల, చిన్నబొంకూరు, మియ్యాపూర్, పెరకపల్లి, నారాయణపూర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. తూకం వేసిన వెంటనే రైతులకు రశీదులు ఇవ్వాలన్నారు. తేమశాతం 17కు మించకుండా చూసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. జిల్లా గ్రంథాల సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, సింగిల్‌విండో చైర్మన్ మోహన్‌రావు, ఏఎంసీ చైర్మన్ ప్రకాశ్‌రావు, ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్, సీఈవో రమేశ్, నాయకులు సాగర్‌రావు, సాయిరి మహేందర్, సతీశ్, అబ్బయ్యగౌడ్, రాజాగౌడ్, రమేశ్, అంజన్, కొండల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

శేషజీవితం ఆనందంగా సాగాలి



అధికారులతో సీపీ శ్రీనివాస్

గోదావరిఖని: ఉద్యోగ విరమణ తర్వాత శేషజీవితం ఆనందంగా సాగాలని రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాస్ ఆకాంక్షించారు. బుధవారం ఉద్యోగ విరమణ పొందిన ఏఎస్‌ఐ పున్నంచంద్, ఏఆర్‌ఎస్‌ఐ కె.సమ్మయ్యను తన కార్యాలయంలో శాలువాలతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. సీపీ మాట్లాడుతూ అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో పోలీసులు విధులు నిర్వర్తిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ(అడ్మిన్) రాజు, స్పెషల్ బ్రాంచ్, సీసీఎస్, ఏఆర్ ఏసీపీలు రాఘవేంద్రరావు, వెంకటస్వామి, ప్రతాప్, సుందర్, రిజర్వ్ సీఐలు దామోదర్, వామనమూర్తి, సంపత్, శ్రీనివాస్, మల్లేశం, కృష్ణ, సిబ్బందితోపాటు పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు బొర్లకుంట పోచలింగం, స్వామి తదితరులు పాల్గొన్నారు.

రూ.20 లక్షల పన్ను చెల్లింపు



చెక్కు అందిస్తున్న కళాశాల యాజమాన్యం

జ్యోతినగర్(రామగుండం): సింధూర ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం రూ.20,94,828 ఆస్తిపన్నును బుధవారం తహసీల్దార్ కుమారస్వామికి చెక్కు రూపంలో అందజేసింది. కలెక్టర్, అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు పదిమంది ఆస్తిపన్ను మొండి బకాయిదారులకు రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం నోటీసులు జారీ చేశారు. స్పందించిన సింధూర ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం చెక్కు అందజేసింది. కాగా, మరో 9 మంది మొండి బకాయిదారులకు రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం తహసీల్దార్ నోటీసులు జారీచేసినట్లు కలెక్టర్ తెలిపారు. బల్దియా అసిస్టెంట్ కమిషనర్ రాజలింగు, సూపరింటెండెంట్ ఆంజనేయులు, ఆర్‌ఐలు శంకర్‌రావు, కరుణాకర్, బిల్ కలెక్టర్ మహేశ్, యాజమాన్యం ప్రతినిధులు పాల్గొన్నారు.

వేర్వేరుగానే ధాన్యం సేకరణ

- ఒక్కో కొనుగోలు కేంద్రంలో రెండేసి కాంటాలు
- వేర్వేరుగా సన్న, దొడ్డురకం ధాన్యం తూకం
- రూ.500 బోనస్ కూడా వేరుగానే చెల్లింపు
- జిల్లా పౌర సరఫరాల మేనేజర్ శ్రీకాంత్‌రరెడ్డి
- 'సాక్షి' ఫోన్‌ఇన్‌కు విశేష స్పందన



రైతుతో ఫోన్‌లో మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: రైతుల నుంచి ధాన్యం మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు ఏర్పాటు చేసిన సెంటర్లలో ఈసారి రెండేసి తూకం వేసే కాంటాలు ఏర్పాటు చేశామని జిల్లా పౌర సరఫరాల మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి వెల్లడించారు. దొడ్డు, సన్నరకం ధాన్యాన్ని వేర్వేరుగా సేకరిస్తున్నామన్నారు. 'సాక్షి' బుధవారం నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమం ద్వారా జిల్లాలోని రైతులు వెలిబుచ్చిన సందేహాలకు ఆయన సమాధానాలు ఇచ్చారు. అయితే, సన్నరకం వడ్లకు రూ.500 బోనస్ అందుతుందా? లేదా? అనే సందేహాలే రైతుల నుంచి అధికంగా వినిపించాయి. జిల్లాలో 324 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటివరకు 315 సెంటర్లు ప్రారంభించామన్నారు. నిర్దేశిత తేమశాతంతో ధాన్యం తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు ఇబ్బంది పెడితే తన మొబైల్ నంబరు 79950 50722కు ఫోన్‌చేసి సమాచారం అందిస్తే సత్వరమే స్పందిస్తానని అన్నారు.

సాక్షి ఫోన్ ఇన్

- **సన్నరకం ధాన్యం తెచ్చిన రైతులే సంచిని 'ఉల్టా' తిప్పాలా?**
  – మాదారపు వేణుగోపాల్‌రావు, 'విండో' మాజీ డైరెక్టర్, నిట్టూరు

డీఎం : కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బంది కలుగనివ్వం. హమాలీలే సంచిని ఉల్టా తిప్పేలా చర్యలు తీసుకున్నాం.

- **నాణ్యత పేరిట మిల్లర్లు కోతలు పెడుతున్నరు?**
  – శ్రీనివాస్, రైతు, పాలకుర్తి

డీఎం : రైతులు ధాన్యం విక్రయించాక మిల్లరుతో సంబంధమే లేదు. మిల్లరుకు ఔట్‌టర్న్ వచ్చినా, రాకున్నా బాధ్యత వాళ్లదే. రైతులు ధాన్యాన్ని నాణ్యంగా ఉండేలా కొనుగోలు కేంద్రాలకు తేవాలి.

- **కౌలు రైతుకు బోనస్ వర్తిస్తుందా?**
  – రమేశ్, రైతు, ఎల్కలపల్లి

డీఎం : కౌలు రైతు ధాన్యం విక్రయాలకు ఏఈవో లేదా ఏవోతో ధ్రువీకరించాలి. ధాన్యం సొమ్ము కౌలు రైతు ఖాతాలోకే నేరుగా జమవుతుంది.

- **తూకంలో మోసాలు జరగకుండా చూడాలి?**
  – తీగల సదయ్య, రైతు, హన్మంతునిపేట

డీఎం : ధాన్యం తూకం వేసే యంత్రాలను పరిశీలించి మోసం జరగకుండా చూడాలని తూనికలు, కొలతల శాఖ అధికారులకు ఇప్పటికే సూచించాం. వాళ్లు పర్యవేక్షిస్తున్నారు.

- **హమాలీ భారం రైతులపై మోపొద్దు?**
  – పల్లె సదానందం, కొత్తపల్లి, పెద్దపల్లి మండలం

డీఎం : హమాలీ చార్జీలను రైతులు చెల్లించినా ప్రభుత్వం గతంలో తిరిగి చెల్లించేది. కానీ, 2015 నుంచి చెల్లింపులు నిలిచిపోయాయి. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం.

- **సన్నరకం ధాన్యాన్ని ఎలా గుర్తిస్తారు?**
  – సంతోష్, బేగంపేట, సమ్మయ్య, ఓదెల, శ్రీనివాస్, ఎల్కలపల్లి

డీఎం : కొనుగోలు కేంద్రాల్లో సన్న, దొడ్డు రకం ధాన్యాన్ని వేర్వేరుగా సేకరిస్తారు. సన్నాలను గుర్తించేందుకు ప్రతీసెంటర్‌కు డిజిటల్ కాలిపర్ యంత్రాలు అందించాం. వాటిలో బియ్యం గింజ వేస్తే అడ్డం, పొడవు కొలిచి రకాన్ని నిర్ణయిస్తుంది.

- **వర్షాలకు ధాన్యం తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచండి?**
  – నల్లగొండ కుమార్, ముత్తారం

డీఎం : వానల నుంచి ధాన్యాన్ని కాపాడేందుకు టార్పాలిన్లను సిద్ధంగా ఉంచుతాం.

- **సన్నరకం ధాన్యంలో ఎన్ని వెరైటీలు ఉన్నాయి?**
  – రాజేశ్వర్‌రెడ్డి, కుమ్మరికుంట, కొండ రవి, ధూళికట్ట, స్వామి బొమ్మారెడ్డిపల్లి, గంగారెడ్డి ధర్మారం

డీఎం : సన్నరకం ధాన్యంలో 33 రకాలు ఉన్నాయి. డిజిటల్ యంత్రాలతో వాటిని గుర్తిస్తారు. యంత్రాలను అన్ని సెంటర్లలో అందుబాటులో ఉంచాం. 17 శాతం తేమ ఉండాలి. 15 శాతం ఉన్నా ఇబ్బంది లేదు.

- **సన్నరకం ధాన్యం అమ్మిన రైతులకు బోనస్‌తో కలిపి సొమ్ము ఒకేసారి చెల్లిస్తారా?**
  – చంద్రయ్య హన్మంతునిపేట, మహిపాల్‌రెడ్డి, బొమ్మారెడ్డిపల్లి, సదయ్య, ఎల్కలపల్లి, రాజ్‌కుమార్, ఎలిగేడు, మదన్‌రెడ్డి, జూలపల్లి, పోశెట్టి ఓదెల

డీఎం : సన్నరకం ధాన్యం విక్రయించిన రైతు బ్యాంకు ఖాతాలో 48 గంటల్లోగా డబ్బులు జమచేస్తాం. ఆ తర్వాత రెండు, మూడు రోజుల్లో ప్రభుత్వం ప్రకటించిన 'బోనస్' సొమ్మును అదే పద్ధతిన జమ చేస్తాం. ఇందుకు సంబంధించిన మెసేజ్‌లు రైతుల సెల్‌ఫోన్‌కు వేర్వేరుగా అందుతాయి. రైతులు ఎలాంటి అనుమానాలకు ఆస్కారమివ్వొద్దు.

వృద్ధులకు 'ఆయుష్మాన్‌భవ'!

- ఏబీ–పీఎంజేఏవైతో 70 ఏళ్లు పైబడిన వారికి ప్రయోజనం
- ఉమ్మడి జిల్లాలో రెండు లక్షల మందికి పైగా లబ్ధిదారులు

సాక్షిప్రతినిధి, కరీంనగర్: కేంద్ర ప్రభుత్వం 70 ఏళ్ల పైబడిన వారికి పేద, ధనిక అనే తేడాలేకుండా వైద్యం కోసం ప్రత్యేక బీమా కల్పిస్తోంది. ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన (ఏబీ–పీఎంజెఏవై) కింద ఈనెల 30 నుంచి ఆరోగ్య బీమా అవకాశం కల్పిస్తోంది. అర్హులైన సీనియర్ సిటిజన్లకు ఈ పథకం కింద కొత్త, విభిన్నమైన కార్డ్ జారీచేయబడుతుంది. ఆధార్ కార్డు ప్రకారం 70 ఏళ్లు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న ఎవరైనా... ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని కేంద్రం తెలిపింది. ఉమ్మడి జిల్లాలోని 13 నియోజకవర్గాల్లో 70 ఏళ్ల పైబడిన వారు ఓటరు లిస్టు ప్రకారం సుమారు రెండు లక్షల మందికి పైగా లబ్ధిదారులు ఉన్నారు. కాగా.. ఇప్పటికే నిరుపేద కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచిత వైద్యం అందించేందుకు బీమా పథకాలు అమలు చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం రూ.5 లక్షల వరకు, రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షల వరకు ఒక్కోకుటుంబానికి వైద్యంకోసం ఖర్చు చేస్తున్నాయి.

దరఖాస్తు చేసే విధానం...

ఏబీపీఎంజేఏవై పథకంలో లబ్ధి పొందేందుకు పీఎంజేఏవై పోర్టల్ లేదా ఆయుష్మాన్ యాప్ లో దరఖాస్తు చేసుకోవచ్చు. పీఎంజేఏవై పోర్టల్ పీఎంజేఏవైజీవోవీ.ఇన్ లాగిన్ అయి 70 ప్లస్ ట్యాబ్‌పై క్లిక్ చేయాలి. దాంతో బెనెఫిషియరీ.ఎన్‌హెచ్‌ఏ.జీఓవీ.ఇన్ అనే వెబ్ సైట్‌కి రీడైరెక్ట్ అవుతారు. అక్కడ క్యాప్చా, మొబైల్ నెంబర్, ఓటీపీ ఎంటర్ చేయాలి. తర్వాత కేవైసీ కోసం వివరాలు నమోదు చేసి ఆమోదం కోసం చూడాలి. ఆయుష్మాన్ కార్డు సిద్ధమైన తర్వాత అధికారిక ఆమోదం లభించిన వెంటనే బీమా కార్డు డౌన్లోడ్ చేసుకోవచ్చు.

ఇవీ ఉపయోగాలు..

- అర్హులైన సీనియర్ సిటిజన్లందరికీ ఈ పథకం కింద ఏబీ–పీఎంజేఏవై రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో ఎంపానెల్ అయిన ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో 1,835 రకాల వ్యాధులకు ఉచితంగా చికిత్సలు పొందవచ్చు.
- లబ్ధిదారులు నమోదు చేసుకున్న మొదటి రోజు నుంచి చికిత్సను యాక్సెస్ చేయడం ప్రారంభించవచ్చు. ఏదైనా వ్యాధి లేదా చికిత్స కోసం వేచి ఉండే కాలం ఉండదు, కాబట్టి కవరేజ్ వెంటనే ప్రారంభమవుతుంది.



అందరికీ వైద్యం అందేలా చూస్తాం...

ఆయుష్మాన్‌భారత్ ఏబీ–పీఎంజేఏవై కింద కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం ద్వారా అర్హులైన 70 ఏళ్ల పైబడిన సీనియర్ సిటిజన్లందరికీ వైద్యం అందేలా చర్యలు చేపడుతాం. ఆయుష్మాన్ భారత్ అమలు చేస్తున్న ఆసుపత్రులలో చేరితే ఈ పథకం వర్తిస్తుంది.
– విజయ్‌కుమార్, ఆరోగ్యశ్రీ డీఎం

జిల్లా	ఆయుష్మాన్ కార్డులు	70 ఏళ్లు పైబడిన వారు
కరీంనగర్	28,6,038	84, 506
జగిత్యాల	34,8,602	44,163
పెద్దపల్లి	19,7,440	55,517
సిరిసిల్ల	11,1,243	35,122

ఆస్తుల పరిరక్షణే ఆర్‌పీఎఫ్ లక్ష్యం

- ప్రయాణికుల భద్రతకు పెద్దపీట
- రైల్వే డీఐజీ షాదాన్ జెబ్‌ఖాన్

రామగుండం: రైల్వే ఆస్తుల పరిరక్షణతోపాటు ప్రయాణికుల భద్రతపైనే రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) ప్రత్యేక దృష్టి సారిస్తుందని ఆర్‌పీఎఫ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (డీఐజీ) ఎండీ షాదాన్ జెబ్‌ఖాన్ అన్నారు. దాణాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో బుధవారం రామగుండం రైల్వేస్టేషన్ చేరుకున్న ఆయనకు ఆర్‌పీఎఫ్ సీఐ సురేశ్‌గౌడ్ ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా డీఐజీ మొక్క నాటారు. కేసుల వివరాలు, రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సిబ్బందితో వివిధ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. రైల్వే బోగీల్లో త్వరలోనే సీసీ కెమెరాలు అమర్చుతామన్నారు. ఇప్పటికే సూపర్‌ఫాస్ట్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో సీసీ కెమెరాలను బిగించారని తెలిపారు. రామగుండంలో తగిన సిబ్బందిని నియమిస్తామని అన్నారు. ఆర్‌పీఎఫ్ కార్యాలయం కోసం ఆధునిక భవనం నిర్మిస్తారని ఆయన వెల్లడించారు. మహిళల భద్రతకు ఆర్‌పీఎఫ్ పెద్దపీట వేస్తుందని వెల్లడించారు. సమావేశానికి రైల్వే అసిస్టెంట్ కమిషనర్ సుభాష్‌తోపాటు పోలీసు ఉన్నతాధికారులు హాజరయ్యారు.

మంథని ఆర్డీవోగా సురేశ్



మంథని: మంథని రెవెన్యూ డివిజనల్ అధికారిగా కాశబోయిన సురేశ్‌ను ప్రభుత్వం నియమించింది. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయనను నియమించారు. దీంతో బుధవారం సురేశ్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన హనుమా నాయక్‌ను కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రభుత్వానికి సరెండర్ చేశారు. ఆర్డీవోకు పరిపాలనాధికారి రవీందర్, సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

క్లుప్తంగా

రైతు శ్రమ నేలపాలు


దెబ్బతిన్న వరిపంట

రామగుండం: అంతర్గాం, రామగుండం మండలాల్లో మంగళ, బుధవారం కురిసిన వర్షాలతో పొట్టదశకు వచ్చిన వరి పైరు నేలవాలింది. మరోపది రోజుల్లో కోతలు ప్రారంభించే క్రమంలో వర్షాలు అన్నదాతను కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. వ్యవసాయాధికారులు వర్షాలతో పంట నష్టపోయిన రైతులను గుర్తించాలని, నివారణ చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

కోతలు వాయిదా వేయండి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ప్రాంతంలో రానున్న 4 రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని, రైతులు వరి కోతలను వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి అలివేణి బుధవారం సూచించారు. ఇప్పటికే కోతలు పూర్తయితే ధాన్యం తడవకుండా పొలం వద్దనే టార్పాలిన్లు కప్పి ఉంచాలన్నారు. లేదంటే ధాన్యంలో తేమ 17శాతాని కన్నా మించే అవకాశం ఉంటుందన్నారు. పచ్చి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్తే నష్టపోయే అవకాశం ఉంటుందని వాతావరణశాఖ అధికారులు సూచిస్తున్నారని తెలిపారు.

మరో ఇద్దరు బాలికల డిశ్చార్జి

ముత్తారం(మంథని): స్థానిక కేజీబీవీలో దగ్గుతో అస్వస్థతకు గురైన 53 మంది బాలికల్లో 48 మంది ఇప్పటికే ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. అయితే, పెద్దపల్లి, కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న మరో ఇద్దరు బాలికలు బుధవారం డిశ్చార్జి అయ్యారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇంకో ముగ్గురు బాలికల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, గురువారం డిశ్చార్జి చేస్తారని ఎస్‌వో స్వప్న తెలిపారు.

లైంగికదాడి కేసులో జైలు

పెద్దపల్లిరూరల్: లైంగికదాడి చేసిన కేసులో ఓ వ్యక్తికి పదేళ్ల జైలు శిక్ష, రూ.50వేల జరిమానా విధిస్తూ కరీంనగర్ ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కోర్టు జడ్జి నీరజ బుధవారం తీర్పునిచ్చారని ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు. 2017లో పెద్దపల్లి మండలం రాఘవాపూర్ శివారు గొల్లపల్లికి చెందిన హరీశ్‌కుమార్.. ఓ దళిత మహిళపై అత్యాచారం చేశాడని పేర్కొన్నారు. కేసు పూర్వపరాలను పరిశీలించిన జడ్జి.. దోషికి 10ఏళ్ల జైలు, రూ.50వేల జరిమానా విధించారని ఎస్సై వివరించారు.

‘పుడా’ను ఏర్పాటు చేయాల్సిందే..

- జిల్లా కేంద్రానికి ప్రాధాన్యం ఇవ్వరా?
- ప్రాముఖ్యత ఉన్న పెద్దపల్లిని విస్మరించొద్దు
- ‘పుడా’ సాధన సమితిపై రౌండ్‌టేబుల్ సమావేశం


సమావేశంలో రాజకీయ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిని కేంద్రంగా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(పుడా)ను ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత నేతలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు డిమాండ్ చేశారు. పట్టణంలోని అమర్‌చంద్ కల్యాణ మండపంలో బుధవారం ఆల్‌ఇండియా ఫార్వర్డ్‌బ్లాక్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి బొంకూరి సురేందర్ సన్నీ ఆధ్వర్యంలో ‘పుడా’ సాధన సమితి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.

పేరుకే జిల్లా కేంద్రం..

అనూహ్యంగా జిల్లా కేంద్రంగా అవతరించిన పెద్దపల్లిలో ఏర్పాటు కావాల్సిన కార్యాలయాలను ఇతర ప్రాంతాలకు తరలిస్తూ చిన్నచూపు చూస్తున్నారని వక్తలు పేర్కొన్నారు. రామగుండంలో పోలీసు కమిషనరేట్ ఏర్పాటు చేశారని, జిల్లా కోర్టును వేరే ప్రాంతంలోనే ఏర్పాటు చేసేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. ఎప్పట్నుంచో పార్లమెంట్ కేంద్రంగా ఉన్న పెద్దపల్లికి దేశవ్యాప్తంగా గుర్తింపు ఉన్నా కనీసం ఆర్టీసీ బస్ డిపో ఏర్పాటు కావడం లేదన్నారు. బస్టాండ్‌కు కూతవేటు దూరంలోనే రైల్వేస్టేషన్ ఉండడంతో ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల ప్రజలకు పెద్దపల్లి నుంచి రాకపోకలు సాగించేందుకు అనుకూలంగా ఉంటుందని తెలిపారు. పాలకులు ఇప్పటికైనా పెద్దపల్లిపై ప్రత్యేక దృష్టి సారించి బస్ డిపో ఏర్పాటు చేయాలని కోరారు.

‘పుడా’ తోనే అభివృద్ధి

పుడా ఏర్పాటు చేస్తేనే ఈప్రాంతం అభివృద్ధి చెందుతుందని వక్తలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. పారిశ్రామిక ప్రాంతం పెద్దపల్లి అభివృద్ధి ఆశించిన స్థాయిలో లేదని రౌండ్‌టేబుల్ అన్నారు.

చర్యలు తీసుకోవాలి



పెద్దపల్లిలో ‘పుడా’ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. కొత్తగా ఏర్పాటైన జిల్లాల్లో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కోసం ప్రతిపాదించిన తొలి జిల్లా పెద్దపల్లియే. రుడా ఏర్పాటుకు మేం వ్యతిరేకం కాదు. కానీ జిల్లా కేంద్రం పరిసరాల అభివృద్ధికి ‘పుడా’ ఏర్పాటు తప్పనిసరి.

– గంట రాములు, మాజీ జెడ్పీటీసీ

చిన్నచూపెందుకు?



పార్లమెంట్ కేంద్రంగా గుర్తింపు ఉన్న పెద్దపల్లిపై పాలకులు చిన్నచూపు చూస్తున్నారు. జిల్లా కేంద్రంగా అవతరిస్తే అభివృద్ధి చెందుతుందని ఆశించిన ప్రజలకు నిరాశే ఎదురవుతోంది. ‘పుడా’ ఏర్పాటుతోనైనా అభివృద్ధి దిశవైపు అడుగులు పడేలా పాలకులు చొరవచూపాలి.

– వేముల రామ్మూర్తి, మాజీ ఎంపీపీ,

జిల్లాకేంద్రం హంగులేవి?



పెద్దపల్లి జిల్లా కేంద్రంగా అవతరించినా అందుకు తగిన హంగులు లేవు. ప్రధాన కూడళ్లు ఇప్పటికీ అధ్వానంగానే ఉన్నాయి. ‘పుడా’ ఏర్పాటుతోనైనా దశ మారుతుందని అనుకుంటే మళ్లీ నిరాశే ఎదురైంది. రాజకీయాలకు అతీతంగా ‘పుడా’ ఏర్పాటుకు తక్షణ చర్యలు తీసుకోవాలి.

– బి.రమేశ్‌గౌడ్, గీత పారిశ్రామిక సంఘం నేత

పెద్దపల్లికే ప్రాధాన్యం



అన్ని జిల్లా కేంద్రాలకు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు ఉన్నాయి. ఈక్రమంలోనే పెద్దపల్లికి ‘పుడా’ ఏర్పాటు చేయాలి. దీంతోనైనా ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్న ఆశ ప్రజానీకంలో ఉంది. ఇప్పటికే జిల్లా కేంద్రానికి దక్కాల్సిన కార్యాలయాలు తరలిపోయాయి.

– కావేటి రాజ్‌గోపాల్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కన్వీనర్

సీఎంతో సమావేశంలో ఎమ్మెల్యే ఠాకూర్


సీఎం, టీపీసీసీ అధ్యక్షుడితో ఎమ్మెల్యే ఠాకూర్

గోదావరిఖని: హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో బుధవారం జరిగిన కులగణన సమీక్ష సమావేశంలో రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన –2024 సర్వే పై అందరూ అవగాహన కలిగి ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించినట్లు ఎమ్మెల్యే వివరించారు. గ్రామాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, తదితర కులాలకు చెందిన వారి ఆర్థిక, సామాజిక, రాజకీయ స్థితిగతులను తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే చేపడుతుందని ఆయన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ సర్వేను త్వరలోనే ప్రారంభించనున్నారని పేర్కొన్నారు. గ్రామాల్లోని ప్రతీ ఇంటికి వెళ్లి సర్వే చేపడతారని పేర్కొన్నారు. తొలుత వివిధ అంశాలపై ప్రజలకు ముందుగానే వివరించాలని ఎమ్మెల్యేలకు సీఎం సూచించినట్లు ఠాకూర్ వివరించారు.

మినీ ఏటీఎం సెంటర్ నిర్వాహకులకు సైబర్ నేరగాళ్ల టోకరా

- బిర్యాని, ఫాస్ట్‌ఫుడ్ బూచీతో మోసం

గోదావరిఖని: నగరంలోని రెండు మినీ ఏటీఎం నిర్వాహకులకు సైబర్ నేరగాళ్లు రూ.1.02 లక్షల టోకరా వేశారు. బుధవారం ఓ బిర్యాని సెంటర్‌కు సైబర్ నేరగాళ్లు ఫోన్‌చేసి 50 బిర్యానీలు కావాలని ఆర్డర్ ఇచ్చారు. ముందుగా డబ్బులు కావాలని బిర్యాని సెంటర్ నిర్వాహకులు అడగడంతో మార్కండేయకాలనీలోని ఓ చోటికి వెళ్తే డబ్బులు ఇస్తారని సైబర్ నేరగాళ్లు బదులిచ్చారు. అక్కడకు వెళ్లిన తర్వాత మళ్లీ బిర్యానీ సెంటర్ నిర్వాహకుడు.. సైబర్‌నేరగాళ్లకు ఫోన్ చేయగా అక్కడ ఉన్న పలానా పేరు అతనికి ఫోన్ ఇవ్వాలని సూచించారు. దీంతో బిర్యానీ సెంటర్ నిర్వాహకుడు అతడికి ఫోన్ ఇచ్చాడు. వాళ్లిద్దరూ మాట్లాడుకున్నారు. బిర్యానీ వ్యాపారి ఎదురుగా ఉండగానే ఫోన్‌లో సంప్రదింపులు జరిపి తనకు అర్జంట్‌గా రూ.50వేలు అవసరం ఉందని, ట్రాన్స్‌ఫర్ చేస్తే ఆతను క్యాష్ ఇస్తాడని, అందుకు రూ.3వేలు కమీషన్ తీసుకోవాలని సైబర్ నేరగాళ్లు సూచించారు. కమీషన్‌కు కట్ చేసుకుని మిగతా రూ.47వేలను సైబర్ నేరగాళ్లకు ఆన్‌లైన్‌లో ఫోన్‌పే చేశాడు. ఫోన్ పెట్టేసిన తర్వాత రూ.50వేలు ఇవ్వాలని బిర్యాని సెంటర్ వ్యక్తిని కోరాడు. తనకు బిర్యాని డబ్బులు ఇస్తానంటే ఇక్కడకు వచ్చానని, తానెందుకు డబ్బులు ఇవ్వాలని మినీ ఏటీఎం సెంటర్ నిర్వాహకుడిని ప్రశ్నించాడు. దీంతో మోసపోయానని గ్రహించిన మినీ ఏటీఎం ఓనర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మరో ఏటీఎం సెంటర్‌కు ఇదే తరహా టోకరా..

రాజేశ్ థియేటర్ సమీపంలోని మరో ఏటీఎం సెంటర్‌కు సైబర్ నేరగాళ్లు రూ.55వేలు టోకరా వేశారు. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వాహకుడికి ఫోన్‌చేసి 50 ఎగ్ బిర్యానిలు కావాలని కోరారు. ఆర్డర్‌కు సంబంధించిన డబ్బులు ఇవ్వాలని సంబంధిత ఫోన్ చేసిన వ్యక్తిని కోరగా.. సమీపంలోని మినీ ఏటీఎంకు వెళ్లాలని సూచించాడు. అక్కడకు వెళ్లిన తర్వాత ఫోన్‌లో మాట్లాడుతూనే సైబర్ నేరగాళ్లు రూ.55వేలు అదే తరహాలో మోసం చేశారు. ఒకేరోజు రూ.1.02 లక్షలు టోకరా వేయడం చర్చనీయాంశంగా మారింది.

సకాలంలో సర్వే పూర్తిచేయాలి

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సమగ్ర సర్వేను సకాలంలో పూర్తిచేయాలని జెడ్పీ సీఈవో నరేందర్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం సూపర్‌వైజర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీవో గంగయ్య, తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో సురేంద్రకుమార్, ఏవో అలివేణి, ఎంపివో ఫయాజ్ తదితరులు ఉన్నారు.

తప్పులు లేకుండా సర్వే చేయాలి

సుల్తానాబాద్(పెద్దపల్లి): ఇంటింటి సర్వేలో తప్పులు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టాలని పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య సూచించారు. స్థానిక యశోద నరహరి ఫంక్షన్‌హాల్‌లో ఉద్యోగులకు సర్వే తీరుపై బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ, పట్టణాల్లో కుటుంబ సమగ్ర సర్వే చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీవో సమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు భరోసా

- సభ్యులందరూ అర్హులే
- జిల్లాలో 200 సొసైటీలు


చేపలు పడుతున్న మత్స్యకారులు

సుల్తానాబాద్(పెద్దపల్లి): ఉపాధి వేటలో ప్రమాదాల బారినపడుతున్న మత్స్యకారులు, వారి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వ ప్రమాద బీమా పథకం వర్తింపజేస్తోంది. గత ప్రభుత్వం వారికి ఉచితంగా చేపపిల్లలు పంపిణీ చేసింది. వాటి రవాణా, విక్రయాల కోసం ప్రత్యేకంగా వాహనాలు కూడా కేటాయించింది. చెరువులు, కుంటలు, ఇతర జలవనరుల్లో చేపపిల్లలు పోసి.. అవి పెరిగాక విక్రయించి వేలాది కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి. ఈక్రమంలో కార్మికులు అనూహ్యంగా ప్రమాదాల బారినపడితే వారి కుటుంబాలకు ఆసరాగా ఉండేందుకు ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తోంది. 2022 నుంచి ఈ ఏడాదిలో ఇప్పటివరకు 40 మంది మత్స్యకార్మికులు మృతి చెందగా అందులో 28 కుటుంబాలకు రూ.ఐదు లక్షల చొప్పు న ఈ పథకం ద్వారా పరిహారం అందజేసింది.

సభ్యులందరికీ వర్తింపు

మత్స్య పారిశ్రామిక సహకార సంఘంలోని సభ్యులు అందరికీ బీమా సౌకర్యం వర్తిస్తుంది. ఈ పథకంలో సభ్యులుగా చెల్లించాల్సిన ప్రీమియం మొత్తాన్ని కూడా ప్రభుత్వమే భరిస్తోంది. నూతనంగా సభ్యత్వం తీసుకున్న వారు కూడా ఈ పథకం వెబ్‌సైట్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను మత్స్యశాఖ అధికారులు పరిశీలిస్తారు. అర్హులను పథకంలో చేర్చేందుకు చర్యలు తీసుకుంటారు. చేపల వేట సందర్భంగా ప్రమాదవశాత్తు నీట మునిగినా, రోడ్డు ప్రమాదంలో మరణించినా.. ఈ పథకం కింద మృతుల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుంది. బీమా పథకంలో చేరడానికి కలెక్టరేట్‌లోని జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి. వాటిని పూరించి, తగిన ధ్రువీకరణ పత్రాలు జతచేసి సంబంధిత అధికారికి అందజేయాలి.

జిల్లాలో 200 సంఘాలు

జిల్లావ్యాప్తంగా 200 మత్స్య సహకార సంఘాలు పనిచేస్తున్నాయి. ఈ సంఘాల్లో 14,116 మంది సభ్యులు ఉన్నాయి. ఇందులో మహిళా సభ్యులు కూడా ఉండడం విశేషం. వీరందరూ చేపల వేట వృత్తిలో కొనసాగుతూ జీవనం సాగిస్తున్నారు. ప్రధాన మంత్రి మత్స్య బీమా యోజన పథకంలో వీరందరూ తమ పేర్లు నమోదు చేసుకునేలా అధికారులు ప్రచారం చేస్తున్నారు.

పెద్దపల్లిని సుందరంగా తీర్చిదిద్దుతాం

- ఎమ్మెల్యే విజయరమణారావు


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంగా అవతరించిన పెద్దపల్లి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. మున్సిపల్ పరిధిలోని 29, 32వార్డుల పరిధిలో బుధవారం పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ప్రజలకు కనీస మౌలిక వసతులు కల్పించడంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు చెప్పారు. పట్టణ ప్రజలకు ఆహ్లాదం పంచేలా అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. పట్టణ అభివృద్ధి కోసం ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజయ్య, నాయకులు రమేశ్‌గౌడ్, పోతని పురుషోత్తం, సురేశ్‌గౌడ్, సత్యనారాయణరెడ్డి, జగదీశ్, రంగు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పాటల పోటీల్లో ప్రతిభ


విద్యార్థిని అభినందిస్తున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మాధవి, పలువురు ప్రతినిధులు

రామగుండం: స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలోని ఇంటర్ విద్యార్థిని ఇ.అక్షయ పాటల పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మాధవి, గైడ్ టీచర్ సాజిదా, సమగ్ర శిక్షా కళా ఉత్సవాలు ఇన్‌చార్జి గడ్డం జగదీశ్వర్ తదితరులు బాలికను అభినందించారు.

రాజన్నను దర్శించుకున్న అఘోరి


వేములవాడ రాజన్న సన్నిధిలో అఘోరి

వేములవాడఅర్బన్/కొండగట్టు: వేములవాడ రాజన్న, కొండగట్టు అంజన్నను బుధవారం అఘోరి దర్శించుకున్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. సనాతన ధర్మంపై అవగాహన కల్పించడం కోసమే ఆలయాలు సందర్శిస్తున్నట్లు తెలిపారు. అయితే ఆమెను చూసేందుకు భక్తులు ఎగబడ్డారు.

కుటుంబ సర్వేపై నిర్లక్ష్యం వద్దు

రామగిరి(మంథని): సామాజిక, ఆర్థిక, కులగణన సర్వేపై నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని మంథని ఆర్డీవో సురేశ్ సూచించారు. రత్నాపూర్ గ్రామ శివారులోని రైతువేదికలో బుధవారం సమగ్ర కుటుంబ సర్వేపై డీఎల్‌పీవో సతీశ్ ఆధ్వర్యంలో సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లకు ఏర్పాటు చేసిన శిక్షణలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆర్డీవో సురేశ్ మాట్లాడుతూ, నవంబర్ ఆరో తేదీన సర్వే ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. ఇందుకోసం అందరూ సర్వసన్నద్ధంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాంచందర్‌రావు, ఎంపీడీవో శైలజారాణి, ఎంపీవో ఉమేశ్, పీఆర్ ఏఈ వరలక్ష్మి, ఏవో శ్రీకాంత్, ఈసీ లక్ష్మణ్, ఏపీఎం స్వరూపరాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనిత తదితరులు పాల్గొన్నారు.

అసహజ మరణాలపై దృష్టి సారించాలి

- రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్


మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

గోదావరిఖని: కేసు విచారణ పారదర్శకంగా చేస్తూ, నేరస్తులకు శిక్షపడేలా చూడాలని, అదృశ్యం, అసహజ మరణాలపై దృష్టి సారించాలని రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాస్ ఆదేశించారు. పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లోని డీసీపీ, ఏసీపీ, సీఐ, ఎస్‌హెచ్‌లతో సీపీ బుధవారం జూమ్ మీటింగ్ ద్వారా మాట్లాడారు. మిస్సింగ్ కేసుల్లో వ్యక్తుల ఫొటోలను అన్ని ఠాణాలకు పంపించి, వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి మృతికి గల ఆధారాలు సేకరించాలని సూచించారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ, అట్రాటసిటీ, గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన విచారణ పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలని అన్నారు. ప్రాపర్టీ కేసుల్లో ప్రివెంట్ యాక్షన్ తీసుకోవాలన్నారు. గంజాయి, పేకాట, పీడీఎస్ రైస్, గుడుంబా, వైట్‌కాలర్ తదితర నేరాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని పేర్కొన్నారు. పెద్దపల్లి డీసీపీ చేతన, అడిషనల్ డీసీపీ(అడ్మిన్) రాజు, స్పెషల్ బ్రాంచ్, సీసీఎస్ ఏసీపీలు రాఘవేంద్రరావు, వెంకటస్వామితోపాటు ప్రతాప్, సుందర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల భారం ఆపిన ఘనత కేటీఆర్‌దే

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్


కేసీఆర్, కేటీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న నేతలు

గోదావరిఖని: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలపై మోపేందుకు యత్నించిన విద్యుత్ చార్జీల భారాన్ని ఆపిన ఘనత బీఆర్ఎస్ నేత కేటీఆర్‌కే దక్కిందని, ప్రజాభిప్రాయ సేకరణలో ఈఆర్‌సీని ఒప్పించారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. స్థానిక బీఆర్ఎస్ కార్యాలయం నుంచి చౌరస్తా వరకు బుధవారం ర్యాలీ నిర్వహించారు. అక్కడ మాజీ సీఎం కేసీఆర్, మాజీమంత్రి కేటీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. టపాసులు పేల్చి సంబురాలు నిర్వహించారు. ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల గొంతుకను వినిపించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ తీరు చారిత్రకమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలపై రూ.18,500 కోట్ల విద్యుత్ చార్జీల భారాన్ని మోపే ప్రయత్నాన్ని నిలువరింపజేశారని అన్నారు. కార్యక్రమంలో రామగుండం నగర డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, కార్పొరేటర్లు కల్వచర్ల కృష్ణవేణి, బాదె అంజలీదేవి, గాధం విజయ, పెంట రాజేశ్, నాయకులు గోపు అయిలయ్య యాదవ్, అచ్చె వేణు, బొడ్డుపల్లి శ్రీనివాస్, మెతుకు దేవరాజ్, చల్లా రవీందర్‌రెడ్డి, జహిద్‌పాషా, పిల్లి రమేశ్, సట్టు శ్రీనివాస్, నూతి తిరుపతి, తోకల రమేశ్, ముద్దసాని సంధ్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.